# మున్నూరుకాపుల తడాఖా చూపిస్తం

- కులగణనలో జనాభానే తగ్గిస్తరా?
- బీసీలను నియత్రించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో సీఎం దీక్ష చేయాలి
- యాచిస్తలేం హక్కులు అడుతుగుతన్నం!
- మున్నూరుకాపుల ఆత్మీయ సదస్సులో వక్తలు పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే గంగుల



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కే లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి జోగు రామన్న తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 13: జనాభాలో తమ సామాజికవర్గాన్ని తగ్గించి, అవమానించిన వారికి భవిష్యత్తులో మున్నూరుకాపుల తడాఖా ఏమిటో చూపిస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. 'మేము యాచిస్తలేం.. హక్కులనే అడుగుతున్నం.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 9 మంది ఎమ్మెల్యేలు, మంత్రి పదవులు దక్కాయి. ఇప్పుడు మూడున్నర శాతం చూపి మున్నూరుకాపులను చట్టసభలకు దూరం చేస్తున్నారు.. బీసీలలో అత్యధికంగా అన్యాయానికి గురైనది మున్నూరు కాపులే.. మళ్లీ కులగణన చేపట్టాలి.. అప్పుడే ప్రభుత్వం కుట్ర బయటపడుతుంది' అని వారు అభిప్రాయాలను వ్యక్తంచేశారు. మున్నూరు కాపులు ఐక్యతతో ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం, మున్నూరుకాపు గర్జన కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో మున్నూరుకాపుల 'దశ దిశ' ఆత్మీయ సమావేశం జరిగింది. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, బాజిరెడ్డి గోవర్ధన్, తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మున్నూరుకాపు సామాజికవర్గాన్ని తక్కువ చేసి అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ఇలాగే జరిగితే భవిష్యత్తు తరాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేయడమే కాదు తమ సామాజికవర్గాన్ని అవమానించిందని మండిపడ్డారు. బీసీలను తక్కువ చేసి అందులో మున్నూరుకాపుల సంఖ్యను మరింత తగ్గించారని తెలిపారు. కనీసం రాష్ట్ర అధ్యక్ష పదవులకు కూడా నోచని స్థితికి తీసుకొచ్చారని తెలిపారు. నేడు మంత్రివర్గంలో బీసీలకు స్థానం లేదని, 3.94 కోట్ల జనాభాలో మున్నూరుకాపులు 13 లక్షలే ఉన్నారంటే సిగ్గుచేటని పేర్కొన్నారు.

## మున్నూరుకాపులంటే ఎందుకు భయం?

మున్నూరుకాపులంటే ఎందుకు భయపడుతున్నారని గంగుల కమలాకర్ ప్రశ్నించారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతున్నందునే అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌లో బీసీలను నియంత్రించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో మాజీ ఎంపీ వీ హన్మంతరావు కూడా సీఎం కావాల్సి ఉండగా, ఆయనను తొక్కిపెట్టారని ఆరోపించారు. మున్నూరుకాపులు తలచుకుంటే ప్రభుత్వమే ఉండదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. ఈ సమావేశానికి రాకుండా ప్రభుత్వంలోని కొందరిని అగ్రవర్ణ పెద్దలు అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుపై చిత్తశుద్ధి ఉంటే సీఎం, మంత్రులు ఢిల్లీలో ఆమరణ దీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చందర్, నరేందర్, సురేంద్ర, ఎమ్మెల్సీ కొమురయ్య, మాజీ ఎమ్మెల్సీ లలిత, టీడబ్ల్యూఆర్‌డీసీ మాజీ చైర్మన్ ప్రకాశ్, జగిత్యాల జడ్పీ మాజీ చైర్మన్ వసంత్, మున్నూరుకాపు మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పటేల్, మున్నూరుకాపు గర్జన నిర్వహణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ చందు జనార్దన్, మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్‌కుమార్, మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు రవిపటేల్, అపెక్స్ కమిటీ కన్వీనర్ పురుషోత్తంపటేల్, మహిళా అధ్యక్షురాలు పద్మ, యూత్ ఫోర్స్ అధ్యక్షుడు అఖిల్, సాయి, అరుణ్, విఠల్, సంజీవ్, ప్రవీణ్, అనిల్, రామారావు పాల్గొన్నారు.

- సన్న బియ్యం కోసం సంచుల క్యూ


నిర్మల్ జిల్లాలో సన్నబియ్యం కోసం లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద ఆపసోపాలు పడుతున్నారు. ఆదివారం కుంటాల మండలం లింబా(కే) గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఉదయం ఆరు గంటలకు తీయాల్సి ఉండగా ఆలస్యంగా తెరిచాడు. దీంతో రేషన్‌దారులు ఎండలో నిలబడలేక తాము తెచ్చుకున్న సంచులను ఇలా క్యూలో పెట్టారు. - కుంటాల

### అంతర్జాతీయ సమ్మేళనానికి నల్లమల కవి

బల్మూరు, ఏప్రిల్ 13 : హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో మే 8న నిర్వహించనున్న అంతర్జాతీయ కవి సమ్మేళనానికి నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన కవి, రచయిత హర్మల్ రవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు కవులు, గ్రామస్థులు రవికి అభినందనలు తెలిపారు.

### బీసీ జేఏసీ జిల్లాల ఇన్‌చార్జుల నియామకం

హైదరాబాద్, ఏప్రిల్13 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి 10 జిల్లాల వారీగా బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఇన్‌చార్జులను నియమించినట్టు బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గటిక విజయ్‌కుమార్ (రంగారెడ్డి), తీన్మార్ మల్లన్న (హైదరాబాద్), బందారపు నర్సయ్యగౌడ్ (మెదక్), దేశగాని సాంబశివుడు (నిజామాబాద్), ఓదెలు యాదవ్ (నల్లగొండ)ని నియమించినట్టు తెలిపారు.


సూర్యతేజ రైస్ మిల్లు వద్ద రైతులకు మద్దతుగా ధర్నా చేస్తున్న బాదలాపురం గ్రామస్థులు

## సన్నాల కొనుగోళ్లలో రభస

- మద్దతు ధర కోసం రైతుల పట్టు
- ఎగవేసేందుకు మిల్లర్ల పైఎత్తులు
- మిర్యాలగూడ మిల్లులో వివాదం
- పరస్పరం దాడులు, ఫిర్యాదులు
- చోద్యంచూస్తున్న అధికారులు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్13(నమస్తే తెలంగాణ)/మిర్యాలగూడ రూరల్: నల్లగొండ జిల్లాలో సన్నధాన్యం కొనుగోళ్ల వ్యవహారం ప్రహసనంగా మారి ఏకంగా వివాదాలకు దారితీస్తున్నది. మిర్యాలగూడలోని ఓ రైస్‌మిల్లులో పరస్పర దాడులు జరిగినట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడం కలకలం రేపింది. సన్నాలపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడటంతో రైస్‌మిల్లర్ల ఇష్టారాజ్యంగా మారింది. ఒక దశలో క్వింటాకు రూ.2,500 నుంచి రూ.2,800 వరకు లభించాల్సిన సన్నాల ధర కనీసం రూ.2,000 నుంచి రూ.2,100 దాటకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మద్దతు ధర ఇప్పిస్తామని అక్కడక్కడా కొందరు రంగంలోకి దిగడంతో వివాదాలకు దారితీస్తున్నది.

### రెండు జిల్లాల ధాన్యం ఇక్కడే విక్రయం

మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి, గూడూరు, వెంకటాద్రిపాలెం, వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారుల్లోని రైస్‌మిల్లులు సన్నధాన్యం కొనుగోళ్లకు ప్రసిద్ధి. దీంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని అధిక ప్రాంతం రైతులు తమ సన్నధాన్యాన్ని తెచ్చి ఇక్కడే విక్రయిస్తుంటారు. హెచ్‌ఎంటీ రకాలకు రూ.2 వేల వరకు, జైశ్రీరాం, చింట్లు, జేఎస్‌ఆర్ రకాలకు రూ.2,150 వరకే ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు ఒక్కో క్వింటాపై రూ.200 నుంచి 300 వరకు నష్టపోతున్నారు. నిత్యం లక్షలాది రూపాయల తమ కష్టాన్ని మిల్లర్లు దోచుకుంటున్నారని రైతులు భగ్గుమంటున్నారు. ప్రభుత్వం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తున్నది.

### ఇరువర్గాల ఫిర్యాదులు

గొడవ సద్దుమణగక పోవడంతో స్థానిక యువకుడైన శివనేని నాగరాజును పోలీస్ వ్యాన్ ఎక్కిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అనంతరం మిల్లు యజమాని మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాదలాపురానికి చెందిన నాగరాజు, వెంకన్న, సైదులు తమకు సంబంధం లేని ధాన్యం తెచ్చి ఎక్కువ ధరకు కొనాలని ఒత్తిడి తెచ్చారని, తమపైనా దాడి చేశారన్న తదితర కారణాలతో ఫిర్యాదు చేశారు. మిల్లు యజమాన్యం కూలీలతో తమపై దాడి చేయించి గాయపర్చినట్టు నాగరాజు, వెంకన్న, సైదులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై దాడికి పాల్పడిన మిల్లు యజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట వీరు తమ కుటుంబసభ్యులతో ఆందోళనకు దిగారు.

### సూర్యతేజ రైస్‌మిల్లు వద్ద ఘర్షణ

మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి శివారులోని సూర్యతేజ రైస్‌మిల్లు వద్ద శనివారం సాయంత్రం మిల్లు యజమాన్యానికి, స్థానికులకు మధ్య వివాదం జరిగింది. ఈ వివాదంలో మిల్లు యాజమాన్యం రైతులపై దాడికి పాల్పడిందంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. సూర్యతేజ రైస్‌మిల్లుకు శనివారం పెద్ద ఎత్తున సన్నధాన్యం ట్రాక్టర్లు వచ్చాయి. ఎప్పటిలాగే ఇక్కడ మద్దతు ధర లభించకపోవడంతో రైతుల్లో తీవ్ర అసహనం నెలకొన్నది. ఇదే అదనుగా మిల్లు ప్రాంతంలోని బాదలాపురం గ్రామానికి చెందిన కొందరు స్థానికులు రంగంలోకి దిగారు. రైతుల ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాల్సిందేనని సూర్యతేజ రైస్‌మిల్లు యజమాన్యంపై ఒత్తిడి తెచ్చారు. అప్పటికే సాయంత్రం కావడంతో తీసుకోలేమంటూ మిల్లు యజమాన్యం నిరాకరించింది. ఈ క్రమంలో మిల్లు ఓనర్ రంగనాథ్‌తోపాటు ఇతర సిబ్బందికి స్థానికులకు మధ్య తీవ్ర వాగ్వాదంతోపాటు ఘర్షణ చోటుచేసుకున్నది.

## ఇద్దరు రైతుల ఆత్మహత్య

- వండగండ్ల వానతో పంట నష్టం
- రుణమాఫీ కాక, రైతుభరోసా జమ కాక తీవ్ర మనస్తాపం
- ఇద్దరు రైతుల బలవన్మరణం
- ములుగు, ఆదిలాబాద్‌లో విషాదం

మంగపేట/బేల, ఏప్రిల్ 13 : సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వడగండ్ల వానతో 27 ఎకరాల్లో నేలరాలిన పంట వద్దనే ఓ రైతు దిగాలుతో పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దిగుబడి సక్రమంగా రాకపోవడం, రుణమాఫీ కూడా కాకపోవడం, రైతుభరోసాను బ్యాంకు అధికారులు జమచేసుకోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో మరో రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రెండు ఘటనలు ఆదివారం ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన యాలం నర్సింహారావు(45) తనకున్న ఐదెకరాల పొలంతోపాటు మరో 22 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. పంటలు చేతికొచ్చాక ఈ నెల 7న కురిసిన భారీ వడగండ్ల వానకు అన్ని పంటలు పూర్తిగా నేలపాలయ్యాయి. తీవ్ర మనస్తాపానికి గురైన నర్సింహారావు ఈ నెల 10న దెబ్బతిన్న చేను వద్దనే పురుగు మందు తాగాడు. నర్సింహారావు హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. నర్సింహారావు కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### అప్పు కింద రైతుభరోసా జమతో..

ఆదిలాబాద్ జిల్లా దౌన గ్రామానికి చెందిన రైతు రాథోడ్ అరవింద్(35) తనకున్న నాలుగెకరాల్లో పత్తి, కంది సాగు చేశాడు. సాగు కోసం రూ. 3లక్షలు అప్పు చేశాడు. అతడికి రుణమాఫీ కూడా కాలేదు. దీనికితోడు తన తండ్రి హన్ సింగ్‌కు రామాయి గ్రామంలోని బ్యాంకులో కొంత అప్పు ఉండగా.. అరవింద్‌కు వచ్చిన రైతుభరోసా నగదును కూడా తన తండ్రి అప్పు కింద బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారు. అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో శనివారం రాత్రి ఇంట్లోనే పురుగుమందు తాగాడు. ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు.


రాథోడ్ అరవింద్(ఫైల్)

**రెపోరేటు దిగింది..**

# మీ ఈఎంఐ తగ్గిందా?

### క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్న గృహ రుణగ్రహీతలు ఏం చేయాలి


**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో ద్రవ్యసమీక్షలోనూ రెపోరేటును తగ్గించింది. దీంతో ఫ్లోటింగ్ రేటు ఆధారిత రుణాలపై, ప్రధానంగా గృహ రుణాలపై వడ్డీరేట్లు కూడా తగ్గుతున్నాయి. అయినప్పటికీ రుణగ్రహీతలందరికీ ఈ ఉపశమనం లభించట్లేదు. ముఖ్యంగా క్రెడిట్ స్కోర్లు తక్కువగా ఉన్నవారికి. రాబోయే ద్రవ్యసమీక్షల్లోనూ కోతలకు వీలుందన్న సంకేతాల నేపథ్యంలో మరి అలాంటివారు ఏం చేయాలి?**




**ప్రస్తుతం** చాలావరకు గృహ రుణాలు ఫ్లోటింగ్ రేటు ఆధారిత లోన్లే. ఇవి ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్‌ఆర్)కు అనుసంధానమై ఉంటాయి. సాధారణంగా రెపోరేటుకు అన్నమాట. దీంతో ఆర్బీఐ ఈ రెపోరేటును తగ్గిస్తే.. సదరు ఫ్లోటింగ్ రేటు ఆధారిత రుణాలపై వడ్డీరేట్లూ తగ్గుతాయి. ఫలితంగా వారివారి ఈఎంఐ (నెలవారీ కిస్తీలు) భారం కూడా దిగుతుంది. కానీ కొందరికి పూర్తిస్థాయిలో ఈ ప్రయోజనాన్ని రుణదాతలు (బ్యాంకర్లు లేదా ఇతర హౌజింగ్ ఫైనాన్స్ సంస్థలు) ఇవ్వడం లేదు. తక్కువ క్రెడిట్ స్కోర్లు ఉన్నవారికి.. ఎక్కువ క్రెడిట్ స్కోర్లు ఉన్నవారితో పోల్చితే రుణాలపై వడ్డీరేట్లు ఎక్కువగానే ఉంటాయి. ఇది సర్వసాధారణమే. అయితే ఇలా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నప్పటికీ తమ రుణాలపై వడ్డీరేట్లను ఎలా తగ్గించుకోవాలి? దానికి ఉన్న మార్గాలను పరిశీలిస్తే..

### మెరుగైన క్రెడిట్ స్కోర్

ప్రస్తుతం బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల్లో రుణాల కోసం వెళ్తే అక్కడ ముందుగా పరిశీలించేది మీ క్రెడిట్ స్కోర్‌నే. తీసుకున్న రుణాలకు సంబంధించి మీరు ఈఎంఐలు సకాలంలో చెల్లిస్తున్నారా? మీకు ఆర్థిక, రుణ క్రమశిక్షణ ఉందా? అన్నది మీ క్రెడిట్ స్కోర్‌నుబట్టి రుణదాతలు ఓ నిర్ధారణకు వస్తారు. ఒకవేళ మీరు ఈఎంఐలను సరిగ్గానే చెల్లిస్తుంటే తప్పక మీ క్రెడిట్ స్కోర్ ఎక్కువగానే ఉంటుంది. అలాకాకుండా డిఫాల్ట్ అయితే మీ క్రెడిట్ స్కోర్ తగ్గిపోతుంది. కనుక ప్రతీ రుణగ్రహీతకు క్రెడిట్ స్కోర్ కీలకం. దాన్ని కాపాడుకోవాలంటే, మెరుగుపర్చుకోవాలంటే చాలా చాలా క్రమశిక్షణ అవసరం. ఇక 750, ఆపైన మీ క్రెడిట్ స్కోర్ ఉంటే లేదా ఇంతకు తక్కువగా ఉంటే గృహ రుణగ్రహీతలు వడ్డీ భారాన్ని తగ్గించుకోవడానికి ఏం చేయాలో చూద్దాం.




### వడ్డీరేటు పరిశీలన

మీ గృహ రుణ ఖాతాలోకి లాగిన్లై ప్రస్తుతం మీ బ్యాంక్ మీకు వేస్తున్న వడ్డీరేటును చెక్ చేసుకోవాలి. నిజానికి మీ క్రెడిట్ స్కోర్ 750కిపైనే ఉంటే మీరు ఏం చేయాల్సిన అవసరం లేదు. ఆర్బీఐ రెపోరేటు తగ్గిస్తే దానిప్రకారం మీ రుణాలపైనా వడ్డీరేటు తగ్గిపోతుంది. కానీ క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటేనే మీ బ్యాంక్‌తో మీరు ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ఉండాలి. ముందుగా ఏం చేయాలంటే..

### సంప్రదింపులు

మీ క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోవాలి. అనవసరమైన అప్పుల జోలికి వెళ్లకూడదు. సకాలంలో ఈఎంఐలను చెల్లించాలి. వీలైతే మీ దగ్గరున్న నగదుతో అసలు మొత్తాన్ని కొంత తీర్చే ప్రయత్నం చేయండి. పరిమితులకు లోబడే క్రెడిట్ కార్డులను వినియోగించాలి. ఇలా చేస్తూపోతే మీ క్రెడిట్ స్కోర్ త్వరగానే మెరుగవుతుంది. ఆ తర్వాత ఈ-మెయిల్ ద్వారాగానీ బ్యాంక్ శాఖను నేరుగా సందర్శించడంగానీ చేయాలి. తద్వారా మీ క్రెడిట్ స్కోర్ గతంతో పోల్చితే మెరుగైందని, ఆర్బీఐ రెపోరేటు కోతల ప్రకారం మీ రుణంపై వడ్డీరేటును తగ్గించాలని విజ్ఞప్తి చేయాలి. ఒకవేళ ఇందుకు మీ రుణదాత అంగీకరించకపోతే.. రుణాన్ని వేరే బ్యాంక్‌కు లేదా సంస్థకు మార్చుకుంటామని స్పష్టం చేయాలి. సాధారణంగా క్రమశిక్షణ కలిగిన రుణగ్రహీతను వదులుకోవడానికి ఎవరూ సిద్ధపడరు. పైగా వ్యాపారం కూడా పోతుంది కాబట్టి మీ అభ్యర్థనను మన్నించే అవకాశాలే ఎక్కువ.

### గృహ రుణ బదిలీ

వడ్డీరేట్ల తగ్గింపునకు మీ బ్యాంక్ ఒప్పుకోకపోతే మరో బ్యాంక్‌కు వెళ్లడమే ఉత్తమం. అయితే ఏ బ్యాంక్‌లో ఎంతెంత వడ్డీరేట్లు ఉన్నాయి? అన్నది ఆరా తీయాలి. అలాగే ఈ మొత్తం ప్రక్రియకు అయ్యే ఖర్చునూ తెలుసుకోవాలి. ఆపై మారితే ఎంత లాభం చేకూరుతుంది? అన్నదీ తెలుసుకోవాలి. వీటన్నిటి తర్వాత మీకు లాభదాయకం ఉంటేనే లోన్ పోర్టబిలిటీకి ముందుకెళ్లాలి. ఇక మీ గృహ రుణం ఫిక్స్‌డ్ వడ్డీరేటుపై ఉంటే దాన్ని ఫ్లోటింగ్ వడ్డీరేటుకు మారుస్తారా? అన్నదీ కొత్త రుణదాత నుంచి తెలుసుకోవాలి. అన్నీ అనుకూలిస్తేనే తుది నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.








## అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లపై గత వారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావం కనిపించింది. అయితే ఆఖరి నిమిషంలో అనూహ్యంగా టారిఫ్‌ల అమలును 90 రోజులపాటు వాయిదా వేయడం నష్టాల తీవ్రతను బాగానే తగ్గించిందని చెప్పాలి. శుక్రవారం లాభాలు మునుపటి రోజుల్లో వాటిల్లిన నష్టాలను పెద్ద ఎత్తునే పూడ్చేశాయి మరి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 207.43 పాయింట్లు పడిపోయి 75,157.26 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 75.90 పాయింట్లు తగ్గి 22,828.55 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడ్ వార్ భయాలు మార్కెట్లను వెంటాడే అవకాశాలే ఉన్నాయని చెప్తున్నారు. కారణం.. అమెరికా-చైనా మధ్య టారిఫ్ వార్ తారా స్థాయికి చేరుకోవడమే. ఫలితంగా అమ్మకాల ఒత్తిడికి వీలుందనే అంటున్నారు. ఇక ఈ వారం ట్రేడింగ్ 3 రోజులే జరుగనున్నది. అంబేద్కర్ జయంతి, గుడ్ ఫ్రైడేలతో సోమ, శుక్రవారాలు మార్కెట్లకు సెలవు. దీంతో మంగళ, బుధ, గురువారాల్లోనే మార్కెట్లుంటాయి. కాగా, ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..:** స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.




## మార్జిన్ ట్రేడింగ్ తెలుసా?

**స్టాక్** మార్కెట్ లావాదేవీల్లో తరచూ మార్జిన్ ట్రేడింగ్ మాట వినిపిస్తూ ఉంటుంది. అసలు దీని అర్థమేంటి? ఇది ఎలా పనిచేస్తుంది? అని తెలుసుకోవాలని ఉందా.. అయితే ఇది మీ కోసమే. ఉదాహరణకు మీకు రూ.2 లక్షల విలువైన షేర్లు కొనాలని ఉంది. కానీ మీ దగ్గర అందుకు సరిపడా నగదు లేదు. ఇలాంటప్పుడే మార్జిన్ ట్రేడింగ్.. చిన్న మొత్తాలతో పెద్ద ఎత్తున షేర్లను కొనేందుకు వీలు కల్పిస్తుంది. కనిష్ఠంగా కేవలం రూ.20 వేల (అసలు విలువలో 10 శాతం)తో కూడా రూ.2 లక్షల విలువైన షేర్లను మీ సొంతం చేసుకోవచ్చు. మీరు చెల్లించిన ఆ రూ.20 వేలే మార్జిన్. ఇలా జరిగిన లావాదేవీనే మార్జిన్ ట్రేడింగ్ అని పిలుస్తారు. ఇక ఇక్కడ మిగతా మొత్తాన్ని (రూ.1.80 లక్షలు లేదా 90 శాతం) స్టాక్ బ్రోకర్ చెల్లిస్తారు. దాన్ని ఆ తర్వాత ఇన్వెస్టర్లు వడ్డీతోసహా చెల్లించాల్సి ఉంటుంది.

### మార్జిన్ ట్రేడింగ్ అకౌంట్ అంటే?

మార్జిన్ ట్రేడింగ్ నిమిత్తం స్టాక్ బ్రోకర్ దగ్గర తెరిచే ఖాతానే మార్జిన్ ట్రేడింగ్ ఫెసిలిటీ (ఎంటీఎఫ్) అకౌంట్ అంటారు. ఈ ఖాతాలో మినిమం బ్యాలెన్స్‌ను ఇన్వెస్టర్లు మెయింటెన్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ బ్యాలెన్స్ తగ్గితే సదరు బ్రోకర్ నుంచి మార్జిన్ కాల్ వస్తుంది.

**ప్రయోజనాలు:** మదుపరుల కొనుగోలు శక్తి పెరుగుతుంది. చిన్న మొత్తాలతోనే పెద్ద ఎత్తున షేర్లను కొనడం వల్ల ఏమాత్రం లాభాలు వచ్చినా అది మీకు పెద్దగానే ఉంటాయి.

**రిస్కులు:** మార్జిన్ ట్రేడింగ్‌లో లాభాలకు ఎంతైతే అవకాశాలున్నాయో.. నష్టాలకూ అంతకన్నా ఎక్కువ వీలున్నది. అలాగే ఖాతాలో మినిమం బ్యాలెన్స్ ఎప్పటికీ ఉండాలి. తగ్గితే వెంటనే టాప్-అప్‌తో దాన్ని భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ టాప్-అప్ తీసుకోవడంలో మదుపరి విఫలమైతే.. స్టాక్ బ్రోకర్ ఇన్వెస్టర్ల షేర్లను అమ్మేస్తారు. అది నష్టాన్ని కలుగజేస్తుంది. మీరు తీసుకున్న లోన్‌కు చెల్లించే వడ్డీ.. మీ లాభాలను మింగేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

